1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

జీపీ దయాకర్‌ను సన్మానించిన కజ్జర్ల గ్రామస్తులు

నవతెలంగాణ-తలమడుగు



జీపీగా దయాకర్‌ను నియమించిన సందర్భంగా కజ్జర్ల గ్రామస్తులు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ న్యాయవాది దయాకర్ జీపీగా ఎన్నికైనందుకు కజ్జర్ల గ్రామస్తుల తరపున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పూర్ణచందర్, గంగన్న, తిరుపతి, అశోక్, దేవదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే కేటీఆర్ సభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రైతులకు మేలు చేయడానికే కేటీఆర్, జోగు రామన్న కలిసి ఈనెల 24న రామ్‌లీలా మైదానంలో సభ చేపడుతున్నారని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని రాంనగర్, కేఆర్‌కే, సుభాష్ నగర్ కాలనీలలో ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను పాంప్లెట్ ద్వారా వివరించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ 10 నెలల పాలనలో రైతులు కార్మిక కర్షకులు ప్రజానీకానికి రైతుబంధుతో పాటు రైతు భరోసా అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మపాల్, వసంత్, నవాతే శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత చదువుల్లో రాణించడం గర్వకారణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్దన్ సమాజ్‌లోని విద్యార్థులు ప్రభుత్వ కొలువులతో పాటు ఉన్నత చదువుల్లో రాణించడం గర్వకారణమని హీరసుఖ జాగృతి సమితి అధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. రాష్ట్రీయ పరథాన్ జన్ జాతి ఉత్థాన్ సంఘటన్ ఆధ్వర్యంలో డీఎస్సీలో ఉపాధ్యాయులుగా, నీట్ పరీక్షల్లో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన అభ్యర్థులు, గురుకులాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగులు సాధించిన వారికి సన్మానించారు. ఆదివారం యాదవ సంఘ భవనంలో నాయకులు వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్యం వచ్చిన ఇన్నేండ్ల తరువాత పర్ధాన్ సమజం పిల్లలు ఉన్నత స్థాయికి రావడం గర్వంగా ఉందన్నారు. ఉన్నత చదువులతోనే సమాజ గుర్తింపు, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చరిత్రను కూడా తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రయోజకులను చేసేల ఉన్నత చదువులు చదించాలని ఆకాంక్షించారు.

ఔదార్యం చాటుకున్న ఎస్ఐ



నవతెలంగాణ-హాజీపూర్

గుడిపేట్ లిక్కర్ గోదాం ఎదుట ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఎదురుగా వస్తున్న బైక్‌ను డీకొన్నాడు. సమాచారం అందుకున్న హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేష్ 10 నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని 108లో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం రోడ్డుపై అడ్డంగా ఉన్న కారును, ద్విచక్ర వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకు ఎస్ఐని పలువురు అభినందించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- జెడ్పీ మాజీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్



నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని జెడ్పీ మాజీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గాంధీచౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి రైతు భరోసా ధర్నా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.2లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, తదితర గ్యారంటీలను వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రీరాం నాయక్, ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తోడసం నాగోరావ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పీఎసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ అడే, నాయకులు సయ్యద్ ఖాసీం ఉన్నారు.

సాలేగూడలో కుమురంభీం వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సాలేగూడ గ్రామంలో ఆ దివాసీ సాలేగూడ యూత్ ఆధ్వర్యంలో కుమురంభీం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ యూత్ ప్రెసిడెంట్ సిడం గణపతి, ఉపాధ్యక్షుడు పెంద్రం ప్రభాకర్, నాయకులు మడావి మానిరావు, ఉయిక మోతీరాం, ఆత్రం జంగు, మడావి గంగారాం, పెంద్రం శంకర్, బాపురావు, సోము, రాము పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ ప్రారంభోత్సవం

నవతెలంగాణ-తాండూర్

మండలం అచలాపూర్ గ్రామంలో కీర్తిశేషులు మిట్ట చంద్రయ్య జ్ఞాపకార్థం నిర్మించిన బస్సు షెల్టర్‌ను మాజీ మార్కెట్ చైర్మెన్ గట్టు మురళీధర్ రావు ప్రారంభించారు. మిట్ట చంద్రయ్య సంవత్సరికం సందర్భంగా అచలాపూర్ ఆటో స్టాండ్ వద్ద చంద్రయ్య అల్లుడు ఈర్ల నారాయణ కుటుంబ సభ్యులు నిర్మించారు. ప్రయానికులకు సౌకర్యార్థం బస్సు షెల్టర్ నిర్మించిన మిట్ట చంద్రయ్య కుటుంబ సభ్యులను అచ్చులాపూర్ గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అచలాపూర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్కారు విద్యపై నజర్..!

- డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- పర్యవేక్షణకు మండలానికో ఎంఈఓ నియామకం
- అమ్మ ఆదర్శ పాఠశాలలతో సౌకర్యాల కల్పన
- సర్కారు బడుల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి

సర్కారు విద్యపై ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. ప్రభుత్వ బడుల బాగు కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు చదివే ఈ బడులను బాగు చేయడం ద్వారా అందరికీ నాన్యమైన విద్య లభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలకు పూనుకొంది. తాజాగా ఏండ్లుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం అంతకుముందు పర్యవేక్షణ కోసం ఎంఈఓల నియామకాలను పూర్తిచేసింది. వీటికి తోడు ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట సర్కారు బడులన్నింటిలో సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే చేపడుతున్న పనులు దాదాపు పూర్తికాగా.. మిగిలిన వాటిని సైతం పూర్తిచేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దీంతో అనేక ఏండ్లుగా బోధకులు లేక..సౌకర్యాలు కనిపించక అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల పరిస్థితిలో మార్పు వస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఒకప్పుడు అన్ని సర్కారు బడులే.. అక్కడక్కడ అరకొర ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు తప్పితే..మిగితావన్ని ప్రభుత్వ పాఠశాలలే ఉండేవి. క్రమేపి వీటిలో సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం..ఉపాధ్యాయుల కొరత, ఇంగ్లీష్ మీడియం లేకపోవడం కారణంగా నాణ్యమైన విద్య లభించకపోవడంతో అనేక మంది విద్యార్థులు ప్రయివేటు బాటపట్టారు. రోజువారీ కూలీ పనులు చేసుకునేవారు సైతం ప్రయివేటు బడుల్లో చదివించాల్సిన పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మార్చాలని విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాల అనేక ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. కానీ పాలక ప్రభుత్వాలు వీరి వినతిని అంతగా పట్టించుకున్న సందర్భాలు కనిపించడం లేదు. గురుకులాల అభివృద్ధిపై కనిపించిన దృష్టి సర్కారు బడులపై లేదనే విమర్శలున్నాయి. వీటి బాగు కోసం గత ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తీసుకురాగా.. తాజా ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి పనులను మొదలుపెట్టింది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీతో ఉమ్మడి జిల్లాలో 11062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించగా.. కోర్టు కేసులు మినహాయించి మిగిలిన 10006 పోస్టులను భర్తీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 296 పోస్టులు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 314, మంచిర్యాలలో 255, నిర్మల్‌లో 299 పోస్టులు భర్తీ కావడంతో ఇటీవల వీరికి నియామక పత్రాలు అందించారు. కొత్త ఉపాధ్యాయులు ప్రస్తుతం వారికి కేటాయించిన బడుల్లో చేరారు. దీంతో ఇన్నాండ్లు బోధకుల లేమితో సతమతమవుతున్న సర్కారు బడులకు ప్రభుత్వ తాజా చర్యలు ఉపశమనం కలిగించింది. ఇందులో చదివే పేద విద్యార్థులకు సబ్జెక్టు ఉపాధ్యాయులు అందుబాటులోకి రావడంతో వారి బంగారు భవిష్యత్తుకు ప్రయోజనం చేకూరనుంది.



పర్యవేక్షణకు ఎంఈఓలు..!

సర్కారు బడుల పర్యవేక్షణ విద్యాశాఖకు సవాల్‌గా మారింది. ఆయా మండలాల్లో కీలకమైన మండల విద్యాధికారి(ఎంఈఓ) పోస్టులు ఖాళీగా ఉండటం.. సీనియర్ హెచ్ఎంలతో రెండు నుంచి మూడు మండలాలకు ఎంఈఓ బాధ్యతలు అప్పగించారు. వారు పనిచేస్తున్న పాఠశాలతో పాటు బాధ్యతలు నిర్వర్తిస్తున్న మండలాల్లోని పాఠశాలలను పర్యవేక్షిచడం వారికి కష్టతరంగా మారింది. దీంతో బడుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు వెళ్లకపోవడం.. పాఠాలు పూర్తిస్థాయిలో కొనసాగింపు లేకపోవడం..ప్రభుత్వం నిర్దేశించిన వివిధ కార్యక్రమాలు సైతం చేపట్టిన దాఖలాలు అంతగా కనిపించలేదు. ఇటీవల ప్రభుత్వం మండలానికో ఎంఈఓను నియమించడంతో పర్యవేక్షణకు మార్గం సుగుమమైంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 70మండలాల్లో ఎంఈఓలు అందుబాటులోకి వచ్చారు. వీటితో పాటు అనేక ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు సైతం పూర్తిచేయడంతో ఉపాధ్యాయవర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పదోన్నతుల కారణంగా కొన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చేందుకు ఆస్కారం ఏర్పడింది.

అందంగా ముస్తాబైన బడులు..!

గత ప్రభుత్వం సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పన కోసం మన ఊరు- మనబడి కార్యక్రమం చేపట్టింది. తొలివిడతలో 25శాతం బడులను బాగు చేసేందుకు పనులు చేపట్టింది. కానీ బిల్లులు సకాలంలో రాకపోవడం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట బడులన్నింటిలో సౌకర్యాలు కల్పించాలని సంకల్పించింది. విద్యుత్తు, తాగునీరు, తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేయడంతో పనులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 80శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన వాటిని సైతం పూర్తిచేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రభుత్వ తాజా చర్యలతో సర్కారు బడులు నూతన హంగులను సంతరించుకున్నాయి. పేద విద్యార్థులు చదివే ఈ బడుల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి.



ఆదిలాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- పలు హోటళ్లకు నోటీసులు జారీ
- అనుమానం ఉన్న చోట శాంపిల్స్ సేకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదివారం పర్యటించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో పట్టణంలోని లక్ష్మీ నరసింహస్వామి ఫ్యామిలీ రెస్టారెంట్, ఢిల్లీవాలా స్వీట్ హౌస్, వెంకటేశ్వర స్వీట్ హౌస్, లోటస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

యాజమాన్యలపై ఆగ్రహం వ్యక్తం..

లక్ష్మీనరసింహస్వామి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో రిఫ్రిజిరేటర్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతను మెయింటెన్ చేయకపోవడం, ఫుడ్ గ్రేడ్ లేని ప్లాస్టిక్ కవర్లలో 30కిలోల రూ.15 వేల విలువ కలిగిన కుళ్లిన మాంసపు ఉత్పత్తులను నిలువ చేసి, హానికర ప్రమాదకరమైన రంగులను కలిపిన చికెన్ చేపలు లేబుల్ తదితర వివరాలు లేకుండా ఉన్నటువంటి పన్నీరు మసాలాలు ఫంగస్ బూజు పట్టిన కూరగాయలను గుర్తించారు. దీంతో హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అప్పటికప్పుడే ప్రజల ఆరోగ్యానికి భంగం కలుగకూడదని మాంసపు ఉత్పత్తులను ధ్వంసం చేసి నోటీసులు జారీ చేశారు. అలాగే లోటస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో నాలుగు వేల విలువగల రిఫ్రిజిరేటర్‌లో దీర్ఘకాలం నిల్వ ఉంచిన వాసన పట్టిన మాంసపు ఉత్పత్తులు, 30 కిలోల గ్రేవీ ఎక్స్ట్రా వనస్పతి బూజు పట్టిన కూరగాయలను ధ్వంసం చేశారు. తర్వాత ఆహార పదార్థాలు తయారు, నిల్వచేసే కిచెన్ సరైనటువంటి వెలుతురు లేకుండా పూర్తిగా అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హోటల్ యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో మండిపడిపడ్డారు. దీంతో పలు ఎఫ్ఎస్-ఎస్ఏకి సంబంధించిన నోటీసులు జారీ చేశారు. పలు అనుమానాస్పద శాంపిల్స్‌ని సేకరించారు.

నోటీసులు హెచ్చరికలు జారీ..

అలాగే వినాయకచౌక్‌లోని ఢిల్లీవాలా స్వీట్ హౌస్ శ్రీ వెంకటేశ్వర స్వీట్ హౌస్‌లో అక్కడ ఉన్నటువంటి పరిస్థితులను అపరిశుభ్ర వాతావరణం చూసి అధికారులు నోటీసులు జారీ చేశారు. అధిక మోతాదులో క్యాన్సర్ కారకాలైన కృత్రిమ రంగులను ఉపయోగించి తయారు చేస్తున్నటువంటి స్వీట్స్‌ను అనేక సార్లు మరిగించిన నూనెను, పురుగులు పట్టి దుర్వాసనతో ఉన్న పప్పులను, సమోసాలకు ఆలు కుర్మాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ రకమైన ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఆహార తయారీదారులు ఆహారం అమ్మేవారు ఎంతటి వారైనా సురక్షితమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని హెచ్చరించారు. లేనియెడల చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ, అవసరమైతే సంబంధిత శాఖ సహాయంతో సీజ్ కూడా చేస్తామని హెచ్చరించారు. ఈ టాస్క్ ఫోర్స్ దాడులలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్స్ రోహిత్‌రెడ్డి, పి.స్వాతి, శ్రీషికలతో కూడిన బృందం ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-తాంసి

మండలంలోని కప్పర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో అభ్యసించిన 1988- 89 సంవత్సరానికి సంబంధించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు దేవిదాస్, సుధాకర్, సుదర్శన్, నారాయణ రెడ్డిలను సన్మానించి పాదాభివందనం చేశారు. చనిపోయిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను స్మరించుకుంటు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల పరిచయంతో పాటు వారిని మరోసారి పరిచయం చేసుకున్నారు. ఒకరి కొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ చదువుకొనే రోజుల్లో గడిపిన మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అందరు కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శంషీర్ ఖాన్, ఉపాధ్యాయులు కిష్టన్న, మనోహర్, పూర్వ విద్యార్థులు పడాల శేఖర్, రమేష్, శంకర్, లక్ష్మణ్, వికాస్ రెడ్డి, నారాయణ్ యాదవ్ పాల్గొన్నారు.

సిబ్బందికి ఉల్లాసం కోసమే పోటీల నిర్వహణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధి నిర్వహణలో ఎల్లప్పుడు బిజీగా ఉండే సిబ్బందికి ఉల్లాసం కల్పించేల శాఖ తరపున ఆయా పోటీలను నిర్వహించడం జరిగిందని ఉమ్మడి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ దేవురెడ్డి సిద్దార్థ అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని గాయత్రి గార్డెన్ పోస్టల్ ఉద్యోగుల కోసం నిర్వహించిన ఆయా కల్చరల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, వారి పిల్లలు చేసిన నృత్యాలు, పాడిన పాటలు అలరించారు. మానసిక ఉల్లాసం కోసం పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిలో నిత్యం ఒత్తిడితో ఉండే ఉద్యోగుల మానసిక ఉల్లాసం కోసం పోటీలను నిర్వహించామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు రకాల క్రీడ పోటీలు సాగయన్నారు. చివరి రోజు కల్చరల్ కార్యక్రమాన్ని నిర్వహించి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

భైంసా మార్కెట్‌లో రైతుల నిలువు దోపిడీ

- మితిమీరిపోతున్న కమిషన్ ఏజెంట్ల ఆగడాలు
- మార్కెట్ కాంటాలు లేక మోసపోతున్న రైతులు
- నగదు ఇవ్వాలంటే రూ.వెయ్యికి రూ.30 కట్
- మామూలుగా తీసుకుంటున్న మార్కెట్ కమిటీ అధికారులు



నవతెలంగాణ-భైంసా

భైంసా మార్కెట్‌లో రైతులకు నిలువు దోపిడీ జరుగుతుంది. ముధోల్ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో సోయా పంట పండటంతో అమ్మకానికి రైతులు పంటను మార్కెట్‌కు తెస్తే కొనుగోలుదారులు, కమిషన్ ఏజెంట్లు, రైతులను నిలువుగా దోచుకుంటున్నారు. పంట అమ్మిన తర్వాత నగదు డబ్బులు ఇవ్వాలంటే రూ.వెయ్యికి రూ.30 కట్ చేస్తున్నారు. ఒక రైతు 25 క్వింటాళ్ల సోయా అమ్మితే లక్ష రూపాయలు కమిషన్ ఏజెంట్ వద్ద తీసుకోవాలంటే రూ.3వేలు కట్ చేసి ఇస్తున్నారు. అంటే ప్రతి నిత్యం భైంసాలో కోట్ల రూపాయల్లో మార్కెట్ జరుగుతుంది. అంటే కమిషన్ ఏజెంట్‌దారులు రైతులకు కోటి రూపాయల నగదు ఇస్తే మూడు లక్షల రూపాయలు దోచుకుంటున్నారన్నమాట. ఈ తతంగమంతా నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ, బహిరంగ రహస్యమైనప్పటికీ మార్కెట్ అధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. రైతు కష్టపడి పంట పండిస్తే, మార్కెట్‌కు తెచ్చి అమ్ముదాం అనుకుంటే కమిషన్ ఏజెంట్‌దారులు నిబంధనలకు విరుద్ధంగా రైతుల రక్తం తాగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరంలో రైతు పంట పండిస్తే రైతుకు పెట్టుబడి ఖర్చులు పోను మిగిలేది ఎకరానికి రూ.10 నుంచి రూ.15వేలు మాత్రమే. కమిషన్ ఏజెంట్ దారులు ఆ రైతు నుంచి వేలల్లో దోచుకుంటుంటే ఇక అధికారులు ఎందుకు ఉన్నట్టు అని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే కొనుగోలుదారుల తీరు మరి అధ్వానం క్వింటాలుకు రెండు కిలోల కోత విధిస్తూ, రైతులను దోచుకుంటున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గిస్తున్నట్లు ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. దీనికి తోడు రైతుల పంట తూకం వేయాలంటే మార్కెట్ అధికారులు, మార్కెట్ కాంటాలు ఏర్పాటు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ ఏజెంట్లు తమ దుకాణాల ముందు సొంత కాంటాలను ఏర్పాటు చేసి తూకంలో మోసం చేస్తున్నారన్న ఆరోపణల సైతం ఉన్నాయి. అదేవిధంగా మార్కెట్ కమిటీ దడువాయిల ప్రమేయం లేకుండా తూకం వేస్తున్నారు. తక్ పట్టీలో దడువాయిల పేరిట వెళ్లిన డబ్బులు కమిషన్ ఏజెంట్లే వారి జేబుల్లో వేసుకుంటున్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం, స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రేపు భీం వర్ధంతిని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 22 న బుధవారం మండల కేంద్రంలో నిర్వహించే భీం 84వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ మండల నాయకులు మడావి మాన్కు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ఆదివాసీ గిరిజన ప్రజలందరు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

రిమ్స్‌లో బాల్యమిత్రుల అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని గోపాలకృష్ణ విద్యామందిర్ 1998-99 బ్యాచ్ పదో తరగతి బాల్య మిత్రులు అందరూ కలిసి రిమ్స్ సత్యసాయి నిత్యాన్నదానం ట్రస్ట్‌లో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రిమ్స్‌కు ప్రతి నిత్యం ఎంతో మంది రోగులు వస్తుంటారని సరైన ఆహారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రిమ్స్‌కు వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు వారు పేర్కొన్నారు. తమ బృందం ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరెన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు ఉన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుల్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల పోలీసు డిపార్ట్‌మెంట్‌లో(35) సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకొని హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ విరమణ పొందిన పట్టేపు లింగన్న ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నేరడిగొండలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టేపు లింగన్నను పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్టీఓ ప్రధాన కార్యదర్శి ఎడ్ల నవీన్ కుమార్, లెక్చరర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, జూనియర్ లెక్చరర్ యూనియన్ అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, చక్రి, లక్ష్మణ్, అనిల్, రాళ్లబండి రవి, నర్సరెడ్డి, శ్రీనివాస్, భూషణ్, రవీందర్ పాల్గొన్నారు.



నేటి నుంచి ఫ్లాగ్ డే వారోత్సవాలు

- పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థంలో కట్టడాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల అలజడి, ఉగ్రవాద చర్యలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పి ఉన్నదంటే ఒకప్పటి పోలీసుల త్యాగ ఫలితమే ప్రధాన కారణం. ఒకప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో నిరంతరం మావోయిస్టులు, పోలీసుల మధ్య తరచూ ఎదురుకాల్పులు, రక్తపు మరకలతో అట్టుడికిపోయేది. జిల్లా అభివృద్ధి కుంటుపడి అనేక సమస్యలతో ప్రజలు సతమతమయ్యేవారు. మావోయిస్టులను జిల్లా నుంచి తరిమి వేయడమే పోలీసుల ప్రధానమైన లక్ష్యంగా ఉండేది. అత్యధిక శాతం పోలీసులు అడవుల్లోనే ఉంటూ మావోయిస్టుల ఏరివేతలో గాలింపు చర్యలు చేపట్టుతూ, అడవులను జల్లెడ పడుతూ ఉండేవారు. పల్లె గ్రామాల ప్రజలు ఎప్పుడూ ఏమి జరుగుతుందనే భయం, ఆందోళనతో జీవనం సాగించేవారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇటు ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుంటూ, మావోయిస్టులపై పట్టు సాధించడానికి అనేక కార్యకలాపాలు చేపట్టేవారు. అప్పటి పోలీసుల ఏకైక లక్ష్యం, ప్రజల కోసం, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధమయ్యేవారు. రాజ్యాంగ రక్షణకై ప్రజాస్వామ్య పరిరక్షణకు, సమాజ శ్రేయస్సుకు, అహర్నిశలు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉగ్రవాద, తీవ్రవాద చర్యలను ఎదుర్కొంటూ సంఘవిద్రోహ శక్తుల నుంచి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి రాజీలేని పోరాటం చేస్తూ, అసువులు బాసిన అమర వీరులకు ప్రతి ఏటా జిల్లాలో అక్టోబర్ 15 నుంచి 21 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుపుకుంటారు. 1981 నుంచి 1995 వరకు సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ 48 మంది పోలీసులు అమరులయ్యారు. జిల్లా పోలీసులు ఒక అడుగు ముందుకు వేసి వారోత్సవాల సందర్భంగానే కాకుండా ప్రతిరోజు అమరవీరుల పేర్లు చలామణిలో ఉండాలనే ఉద్దేశంతో పోలీస్ హెడ్ క్వార్టర్‌లో పలు భవనాలకు, ఎన్‌కౌంటర్ ఘటనల స్థలం, అమరవీరుల పేర్లతో పిలుస్తుంటారు.

అల్లంపల్లి కాంప్లెక్స్...

1987 సంవత్సరంలో కడెం మండలం అల్లంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య భీకరమైన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఎస్సైలతో సహా 11 మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారు. అల్లంపల్లిలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి మావోయిస్టుల గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో, మావోయిస్టులు పన్నాగంతో పోలీసులను రప్పించి పైశాచికంగా తుపాకులతో కాల్చారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్, ఈ ఘటన జ్ఞాపకార్థం పోలీస్ హెడ్ క్వార్టర్‌లో మూడంతస్తుల భవనం నిర్మించి అల్లంపల్లి కాంప్లెక్స్‌గా నామకరణం చేశారు.

ఎస్సై కోట్యా నాయక్ చిల్డ్రన్ పార్క్...

1991 సంవత్సరంలో ఉట్నూర్ ఎస్ఐ కోట్యా నాయక్ మావోయిస్టులతో పోరాడి అసువులు బాశారు. మావోయిస్టులు కుట్రతో ముందుగా కొమ్ముగూడ అటవీ ప్రాంతంలో బీడీ ఆకులు కాలబెట్టి ఇన్ఫార్మర్‌తో పోలీసులకు సమాచారం అందించగా అప్పటి ఉట్నూర్ యువ ఎస్సై కోట్యా నాయక్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోవడంతో, రోడ్డుకు ఇరువైపులా పేలుడు పదార్థాలు అమర్చి, కాల్పులు జరిపి అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటనలో ఎస్సైతో పాటు మరో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు అసువులు బాశారు.

చక్రపాణి మెమోరియల్ హాల్...

1993 సంవత్సరంలో మంచిర్యాల్ సీసీసీ నస్పూర్ వద్ద మావోయిస్టులు ఓ ఇంట్లో తల దాచుకున్నట్లు సమాచారం తెలుసుకొన్న అప్పటి శ్రీరాంపూర్ సర్కిల్ సీఐ చక్రపాణి తన గన్ మెన్ అశోక్‌తో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మావోయిస్టులను అదుపులో తీసుకునే క్రమంలో మావోయిస్టులు ఇంటి పైకప్పు నుంచి కాల్పులు జరిపి సీఐ చక్రపాణి, కానిస్టేబుల్ అశోక్‌లపై తుపాకులతో కాల్పులు జరిపి హత్య చేశారు. జిల్లాలో మొదటిసారిగా సీఐ స్థాయి అధికారి మావోయిస్టుల దుశ్చర్యతో అమరుడైనందుకు పోలీస్ సమావేశ మందిరం నిర్మాణం చేసి ఆయన జ్ఞాపకార్థం చక్రపాణి మెమోరియల్ హాల్ పేరుతో నామకరణం చేశారు.

శేషు, సంజీవ్ పేర్లతో వ్యాయామశాల...

2000 సంవత్సరంలో బెల్లంపల్లి, మంచిర్యాల తదితర సింగరేణి ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాల నిర్వహణ బాధ్యత సికాస సంస్థ చేపట్టేది. మావోయిస్టుల ఏరివేతలో ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు శేషు, సంజీవ్ కీలక పాత్ర పోషించేవారు. మావోయిస్టులు ఇద్దరిని టార్గెట్ చేసి తుపాకులతో కాల్చి హత్య చేశారు. వీరి ఇద్దరి జ్ఞాపకార్థం పోలీస్ హెడ్ క్వార్టర్‌లో వ్యాయామశాల నిర్మాణం చేపట్టి నామకరణం చేశారు.

పోలీస్ అమరవీరుల కాలనీ...



2015 సంవత్సరంలో పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం స్థానిక పిట్టలవాడ కాలనీలో ఏకంగా రూ.కోటి వ్యయంతో 48 మంది కుటుంబాల నివాసం కోసం కాలనీ ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న, జిల్లా ఎస్పీలు తరుణ్ జోషి, గజరావు భూపాల్, అదనపు ఎస్పీ టి. పనసారెడ్డి కృషితో స్థలం కేటాయించి, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి నివాసం కోసం నిర్మాణాలు చేపట్టి, పోలీస్ అమరవీరుల కాలనీగా నామకరణం చేసి ప్రారంభించారు.

నేటి నుంచి ఫ్లాగ్ డే వారోత్సవాలు...

ఫ్లాగ్ డే వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసు కార్యాలయాలలో ప్రజల సమక్షంలో అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించి వివరాలను విడుదల చేశారు. ఈ ప్రజాహిత కార్యక్రమాలలో ప్రజలు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఫ్లాగ్ డేను విజయవంతం చేయాలన్నారు.



నూతన ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-సారంగాపూర్

డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందిన వారిని గ్రామ మాజీ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి తమ నివాసంలో ఆదివారం సన్మానించారు. ఉపాధ్యాయులు అందే సాయికృష్ణ, రవీందర్‌రెడ్డి, చింతకింది ప్రవళిక, దేవి, సూర్య, శ్రీకర్‌లను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించడం ఆనందదాయకమని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

రైతులు ప్రభుత్వం అందించే నాణ్యమైన అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని హైమన్‌డార్ఫ్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈఓ కాంబ్లె ప్రజ్ఞశీల్ అన్నారు. ఆదివారం మండలంలో రైతులకు విత్తనాల బ్యాగులను అందించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే టీఎస్ విత్తనాలను రైతులకు అందించాలని, తక్కువ నీటిని ఎద్దడిని తట్టుకునే జేపీ 11, జాకి 9218 విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. జింక్ గోధుమ వెరైటీ బిహెచ్‌యు 31వ రకం గోధుమ విత్తనాలు అవసరం ఉన్న రైతులు ఉట్నూర్ మండల సమాఖ్య కార్యాలయానికి సంప్రదించాలని కోరారు. సీఈఓ నెంబర్లకు 9110395366, 9676727274 నేరుగా కాల్ చేయొచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాడి వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

మారేగావ్ నుంచి కొలమా వరకు రోడ్డు నిర్మించాలి



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని మారేగావ్ నుంచి కొలామా వరకు రోడ్డు నిర్మించాలని కొలామా గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రానికి, ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రయాణికులు గర్భిణులు నానా కష్టాలు పడుతున్నారన్నారు. అదేవిధంగా కొలామా గ్రామంలో షెడ్ నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, దీపావళి తరువాత నిర్మాణ ప్రారంభ పనులకు హామీ ఇచ్చినట్టు గ్రామస్తులు కుమ్ర శంకర్ పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొట్నాక్ రాము, కుడ్మేత గంగు, కనక మనోహర్, కొట్నాక్ శంకర్, కనక మారుతి, లింబారావ్, తిరుపతి, అమృత్‌రావ్, చందర్‌షావ్, మసురే అమర్ ఉన్నారు.

ఉట్నూర్‌లో రాస్తా రోకో



నవతెలంగాణ-ఉట్నూర్

రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకి నిరసనగా ఉట్నూర్‌లోని ఐబీ చౌరస్తాలో రాస్తా రోకో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భారత్ చవాన్ మాట్లాడుతూ రైతులకు రుణమాఫీని వెంటనే పూర్తిస్థాయిలో వర్తింప జేయాలని, రైతు భరోసా కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీఆర్ఎస్ నాయకులు, గ్రామ నాయకులు రైతు సమితి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాథోడ్ రమేష్ జయంతి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజానాయకుడు, ఖానాపూర్ ప్రజల ఆశాజ్యోతి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయిన గొప్ప మహోన్నత వ్యక్తి రాథోడ్ రమేష్ జయంతి వేడుకలను ఉట్నూర్‌లోని తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రితీష్ రాథోడ్‌తో పాటు బీజేపీ ఉట్నూర్ మండల నాయకులు, కార్యకర్తల సమక్షంలో రాథోడ్ రమేష్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, బింగి వెంకటేష్, లింగాగౌడ్, మాజీ జెడ్పీటీసీ సాడిగా గంగన్న, మాజీ ఎంపీపీ ఆడే ధన్‌లాల్, పవార్ దేవిదాస్, కాల్వ రవి పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి మృతి



నవతెలంగాణ-లోకేశ్వరం

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బామ్ని(కె)లో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బర్దిపురం మల్లన్న(58) శనివారం సాయంత్రం దాదాపు 4 గంటల సమయంలో తన ఇంటివద్ద గల బావిపై కూర్చొని పశువుల కోసం చూస్తుండగా అదుపుతప్పి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు మృతుని భార్య రత్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

మూఢనమ్మకాలకు దూరం చేయడానికి జెవీవీ కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంచడంతో పాటు మూఢనమ్మకాలకు దూరం చేయడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ అన్నారు. నవంబర్ నుంచి ప్రారంభించే చెకుముఖి సైన్స్ సంబరాలకు గాను రాష్ట్ర స్థాయి అహ్వాన సంఘం ఏర్పాటుకు ఆదివారం డైట్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మండల, జిల్లా, స్థాయిలో నిర్వహించే చెకుముఖి సైన్స్ సంబరాల తేదీలను తెలియజేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేధిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ మాట్లాడుతూ పిల్లల్లో సైన్స్ పరిజ్ఞానం పెంచే దిశగా తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే సర్ సీవీ రామణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని నవంబర్ 7న పాఠశాల స్థాయి చెకుముఖి సైన్స్ పోటీలను ప్రారంభిస్తున్నామన్నారు. 21న మండల, 28న జిల్లా స్థాయి పోటీలుంటాయన్నారు. ఇక్కడ గెలుపొందిన వారిని డిసెంబర్ 14 నుంచి 16వ తేది వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీలకు 33 జిల్లాల నుంచి విద్యార్థులు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు చెలిమిల రాజేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరప్రసాద్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉమకాంత్, ఉశన్న, ప్రయివేట్ స్కూల్ యాజమాన్యల సంఘం అధ్యక్షుడు రంగినేని పవన్‌రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వామి, శ్రీకాంత్, పార్థసారథి, సొగల సుదర్శన్, ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నదానం జగదీశ్వర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీపై కేంద్ర బీజేపీ స్పందించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్
- అభ్యర్థులపై లాఠీచార్జిని ఖండిస్తున్నాం
- జీఓ 29ను రద్దు చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై బీజేపీ స్పందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను 55 జీఓ ప్రకారం నిర్వహించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై లాఠీచార్జీ చేయడాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండారు రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న 29 జీఓ ప్రకారం జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వ్ అభ్యర్థిని జనరల్ కోటాలో పరిగణించకుండా రిజర్వ్ కోటాలో పరిగణించడం వల్ల ఇతర రిజర్వుడ్ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. 29 జీఓను రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్ టికెట్ నెంబర్లను ఆన్సర్ బుక్లెట్లపై ముద్రించి అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న అభ్యర్థులపై లాఠీచార్జీ చేయడం సరైంది కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అభ్యర్థులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని సూచించారు. నిరుద్యోగుల పట్ల బీజేపీ నాయకులు మొసలి కన్నీరు కారుస్తూ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో నిరుద్యోగుల సమస్యలను విస్మరించి బాధ్యత నుంచి తప్పుకుంటుందన్నారు. మొసలి కన్నీరు ఆపి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన ఎప్పుడు చేస్తారో తెలపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భీంరావు, జిల్లా కార్యదర్శి మల్లేష్, కార్యదర్శి వర్గసభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి ఉన్నారు.

ఏడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు వసతి గృహల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని, 7 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏఎన్ఎంలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కలెక్టర్ జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి స్పందించాలని అన్నారు. ఏఎన్ఎంలకు 7 నెలల నుంచి వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. గత 7 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా అవుట్ సోర్సింగ్ ఏజెన్సికి చెప్పిన పట్టించుకొని పరిస్థితులలో ఉన్నారని అన్నారు. ఏఎన్ఎంలు పాఠశాలల్లో వసతిగృహల్లో స్థానికంగా ఉండి ఆదివాసీ గిరిజన విద్యార్థులకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారని, కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని అన్నారు. ఏఎన్ఎంలకు ఎలాంటి అత్యవసరం వచ్చిన ఒక రోజు కూడా సెలవు ఇవ్వకుండా, వేతనాల్లో కోతలు విధిస్తున్నారని వాపోయారు. కనీసం వీరికి ఉండటానికి వసతి సౌకర్యాలు కూడా లేవని, పీఎఫ్ కటింగ్ చేస్తున్నామని చెపుతున్నారని కాని కటింగ్ విషయంలో పూర్తి సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్సు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులను ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు జే.రాజేందర్, ఏఎన్ఎం యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు కె.కమల, ఆర్.అనిత, కోశాధికారి శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులు నర్మద కామేశ్వరి, సహాయ కార్యదర్శులు జంగుబాయి, అశ్విని, సభ్యులు విజయ్ కుమార్, రాజేశ్వర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

బాధితునికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



చేన్‌లో అడవిపందుల దాడిలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బుయ్యాల సుధాకర్‌ను ఎమ్మెల్యే కోవలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ అటవీ అధికారులు బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. బాధితులకి నాణ్యమైన చికిత్స అందించాలని వైద్యశాఖ అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, రాపెల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలంలో పిచ్చికుక్కల స్వైరవిహారం

నవతెలంగాణ-తిర్యాణి



మండలంలో పిచ్చికుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పిచ్చి కుక్కల దాడులు ఎక్కువగాణ పెరిగాయి. మండలంలో పిచ్చి కుక్కల స్వైర విహారం ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. కుక్కల నియంత్రణకు అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలలని ప్రజలు కోరుతున్నారు. సమస్య ఏర్పడిన తర్వాతే పరిష్కారం కోసం ప్రయత్నించడం వల్ల వచ్చిన నష్టం తిరిగి సరిచేయడం కష్టం. ముందుగా సమస్యను నివారించేందుకు ప్రయత్నిస్తే అది మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- రైతు భరోసాపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



ఆసిఫాబాద్ : ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల సందర్భంగా రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు భరోసాపై చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి రైతు భరోసాపై చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతులకు అండగా ఉంటామని రైతు ప్రభుత్వమని చెబుతున్న కాంగ్రెస్ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని, దానికి తోడు రైతు భరోసా నిధులు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రబీ సీజన్ వరకు పంట వివరాలను సేకరించి రైతు భరోసా వేస్తామని ప్రకటించడం రైతులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయడమే అన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అయిన రైతు భరోసాపై స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. పేద ప్రజలకు వచ్చే అనేక పథకాల్లో కోత పెట్టారని ఆరోపించారు. బాలింతలకు ఉపయోగకరంగా ఉండే కేసీఆర్ కిట్, రక్తహీనత నివారించే న్యూట్రిషన్ కిట్, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఫీజు రియంబర్సమెంట్, ఆర్టీసీ కార్మికుల విలీనం ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ ఇలా అన్ని సంక్షేమ పథకాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాము ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని కొనసాగించాలన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించడంలో నాయకులు విఫలమయ్యారని పర్యటనల్లో హడావుడి అవసరం లేదని మంత్రి పర్యటన ఉద్దేశిస్తూ మాట్లాడారు. హామీలపై నిలదీస్తే అరెస్టులు చేయడం ఏమిటన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ ప్రత్యేక కమిటీలు అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలే ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, పార్టీ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లా నాయకులు సరస్వతి, మాజీ సర్పంచులు భీమేష్, శ్రీనివాస్, బాబురావు, లక్ష్మణ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రెబ్బెన : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, జహీరుద్దీన్, పార్టీ నాయకులు బొమ్మినేని శ్రీధర్, జిమ్మిడి ఆనంద్, తోట లక్ష్మణ్, ఫ్యాక్స్ చైర్మన్ సంజీవ్, వైస్ చైర్మన్ రంగు మహేష్ గౌడ్, ప్రభాకర్, మహిళ నాయకురాలు అన్నపూర్ణ, అరుణ, కుందారం శంకరమ్మ పాల్గొన్నారు.



వాంకిడి : ఎన్ఎస్ఎస్ 363 జాతీయ రహదారిపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

కెరమెరి : హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అబుల్ కలాం అన్నారు. రైతు భరోసాపై సబ్ కమిటీ వేశాం.. ఆ కమిటీ రిపోర్ట్ వచ్చాక వచ్చే సీజన్ నుంచి రైతు భరోసా వేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వాఖ్యానించడం పట్ల ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పేందూర్ మోతిరాం, మాజీ ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, గోగర్ల రాజయ్య, సర్పంచులు తొడసం జగన్నాథ్ రావు, ధనోర మాజీ ఉప సర్పంచ్ రిజ్వాన్, నాయకులు ఇనూస్, అంబాజి, మడావి రఘునాథ్, రాంచందర్, సెండే నారాయణ్, రైతులు పాల్గొన్నారు.



రెబ్బెన : రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వాంకిడి : మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఇచ్చిన పిలుపు మేరకు ఎన్ఎస్ఎస్ 363 జాతీయ రహదారిపై నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, సింగిల్‌విండో చైర్మన్ జాబిరె పెంటు, మాజీ సర్పంచ్ తుకారాం, మాజీ సర్పంచ్ అయూబ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కెరమెరి : ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కలాం

రైలు ఢీకొని గొర్రెలు, మేకలు మృతి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలో శనివారం రాత్రి వర్షం కురుస్తున్న సందర్భంలో గొర్రెల కాపరులు నిద్రిస్తుండగా మేకలు, గొర్రెలు ఒక్కసారిగా పక్కనే ఉన్న రైల్వే పట్టాలపై చేరుకున్నాయి. అంతలోనే గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 200 గొర్రెలు, పది మేకలు మృతి చెందాయి. కౌటాల మండలం శీర్ష గ్రామానికి చెందిన జడ భీమయ్యకు సంబంధించిన గొర్రెలు, మేకలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గొర్రెలు అడవి ప్రాంతంలో మేపి సాయంత్రం తీసుకువచ్చాడు. రాత్రి సమయంలో భారీ వర్షం రావడంతో గొర్రెలు కంచనుండి దాటిపోయాయి. ఉదయం ఆ యజమాని నిద్ర నుండి లేచి చూసే సరికి రైల్వే పట్టాలపై చెల్లా చెదురుగా పడి ఉన్నట్లు గొర్రెలను చూసి కుటుంబ సభ్యులు కన్నీంటి పర్వంతమయ్యారు.

పాలరాపు గుట్ట పర్యటనలో ట్రైనీ బీట్ అధికారులు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని నందిగామ బీట్‌లో గల రాబందుల సంరక్షణ కేంద్రాన్ని అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ స్వరూప రాణి ఆధ్వర్యంలో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ 35వ బ్యాచ్ ట్రైనీ బీట్ అధికారులు సందర్శించారు. రాబందుల ఆవాసాలు, పులుల కదలికలను గుర్తించడానికి ఇక్కడి అధికారులు అవలంభిస్తున్న విధానాలు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కాలువ నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పెంచికల్‌పేట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జమీల్ అహ్మద్, గుండేపల్లి సెక్షన్ ఆఫీసర్ అస్మా, కమ్మర్గామ్ సెక్షన్ ఆఫీసర్ జగన్మోహన్ గౌడ్, ఎఫ్‌బీఓలు అరవింద్ నాయక్, మహేష్, శ్రావణ్ కుమార్, దినేష్, లచ్చన్న, విజయలక్ష్మి, అనిమల్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లోని బర్కత్ పురాలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య అధ్యక్షతన జరిగిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జిల్లా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సంఘ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో మున్నూరు కాపు సంఘం బలోపేతానికి సంబంధించిన పలు అంశాలను తెలియజేస్తూ రాష్ట్ర కార్యవర్గానికి జిల్లా నాయకులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు మిట్ట వెంకన్న, గడ్డల సురేష్, మణిగొండ వెంకటేశ్, పొలంపల్లి గణపతి, మేకర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురుగు కాలువల పనులను పూర్తిచేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఎన్ఎస్ఐ 363 ప్రాజెక్టు మేనేజర్ చందన్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని, కాలువల నిర్మాణ పనులు పూర్తిచేయక మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుందని, మండలకేంద్రంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి ప్రజల ఆరోగ్యంపై వ్యాధుల ప్రభావం ఉంటుందన్నారు. ఇప్పటికైనా పనులు పూర్తిచేయాలని ఆయన కోరారు.

అతిథి అధ్యాపకుల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు సోగల ప్రవీణ్ కుమార్, సయ్యద్ జావేద్ అలీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలో ఉన్న నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి అతిథి అధ్యాపకులు హాజరయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆర్. శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఈ.సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీ.రాహుల్, జిల్లా సహాయ కార్యదర్శిగా జీ.విద్యారాణి, జిల్లా కోశాధికారిగా బీ. ఆనందం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు సభ్యులు, పలువురు అభినందనలు తెలిపారు.



మొన్న అలా.. నేడు ఇలా..

- కొట్టుకుపోయిన గుండి వంతెన
- ఒక్క రోజులోనే ఆవిరైన ఆనందం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి గ్రామానికి వెళ్లడానికి మధ్యలో ఉన్న పెద్ద వాగుపై శుక్రవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మీ నిధులతో తాత్కాలిక వంతెన నిర్మించగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగు ఉప్పొంగడంతో ఆదివారం ఉదయం వరకు కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్తుల సంతోషం ఒక్కరోజులోనే ఆవిరైంది. ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో మట్టితో తాత్కాలిక వంతెన వేసుకోవడం జూన్ నెలలో కొట్టుకుపోవడం పరిపాటిగా మారినప్పటికీ, తాజాగా ఒక్కరోజులోనే కొట్టుకుపోవడంతో మళ్లీ వాగు కష్టాలు గ్రామస్తులకు తప్పడం లేదు. మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో మళ్లీ తాత్కాలిక వంతెన నిర్మించడమా లేదా అనే ఆలోచనలో నాయకులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇదే సందర్భంలో తాత్కాలిక వంతెన కాకుండా శాశ్వత ప్రాతిపదికన వంతెన నిర్మాణం చేపట్టి తమ కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. కష్టాలు పోయే రోజు వస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుంది.



మొన్న



నేడు

దహెగాం సీఓను విధుల నుంచి తొలగించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బెజ్జూర్

వ్యవసాయ ధాన్యం కొనుగోలుకేంద్రంలో ప్రోటోకాల్ పాటించని దహెగాం సీఓను విధుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు బుస శంకర్ మాట్లాడుతూ నిబంధనలు ప్రోటోకాల్ పాటించకుండా కొనుగోళు కేంద్రం ప్రారంభించారన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ని ఆహ్వానించకుండా అవమానించారన్నారు. దహెగాం సీఓతో పాటు సింగిల్ విండో చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై చర్యలు తీసుకుంటు విధుల నుంచి తొలగించాలన్నారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశామన్నారు. ప్రోటోకాల్ విషయం ఎమ్మెల్యే హరిష్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కు కూడా తెలియదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం, గ్రామ అధ్యక్షులు సుంకర్ విష్ణుమూర్తి, కాంగ్రెస్ నాయకులు జాహిద్ హుస్సేన్, మురళి గౌడ్, దందర అంకయ్య, మడే లక్ష్మణ్, తొర్రెం వినోద్, తొర్రెం ప్రశాంత్ పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించే పోలీస్ అమరవీరుల దినోత్సవం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేటి నుండి 11 రోజుల పాటు అమరవీరుల స్మరించుకుంటూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, నేడు నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

ఘనంగా కుంరం సూరు వర్ధంతి



నవతెలంగాణ-వాంకిడి

మండలంలో కుంరం సూరు వర్ధంతి వేడుకలను ఆదివాసీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమురం భీంతో పాటు కుంరం సూరు కూడా ఆదివాసుల కోసం పోరాటాలు చేశారని, సూరు జయంతిని కూడా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరు సూరు అడుగుజాడల్లో నడవాలని ఆదివాసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో సోయం భీంరావు, అన్నిగ, తుకారాం, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన వారికి ఘన సన్మానం

నవతెలంగాణ-తలమడుగు



కుచులాపూర్ గ్రామానికి చెందిన నలుగురు ఉద్యోగాలు సాధించడంతో ఆదివారం గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మేకల లావణ్య, రాగి సంజీవ్, బోనగిరి శివ, రామకృష్ణలకు గ్రామస్తులు గ్రామపంచాయతీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళ్యాణం రాజేశ్వర్, జనార్దన్, దీపక్, చల్ల దేవన్న, శ్రీనివాస్, జక్కుల ప్రభాకర్, రణవీర్, మహేందర్ పాల్గొన్నారు.

ఆర్డర్ ఇవ్వకపోతే ఆందోళనలు

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

డీఎస్సీలో జిల్లా విద్యాశాఖ తప్పిదాల వల్ల నష్టపోయిన నిరుద్యోగులకు మూడు రోజుల్లో ఉత్తర్వులు ఇస్తానని రాసి ఇచ్చరాని, కానీ గడువు ముగిసి వారం కూడా పూర్తి కావస్తున్నా కూడా ఇంతవరకు విద్యాశాఖ ఎలాంటి ఉత్తర్వులు వెలువడకపోవడంతో అభ్యర్థులు సర్వీస్‌లో వెనుకబడిపోతారని ఆందోళనకు గురవుతున్నారని టీయూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిజికల్ సైన్స్ ఆప్షన్ ఇచ్చిన అభ్యర్థికి దానిని కేటాయించాలని పేర్కొన్నారు. రాబోయే రెండు రోజుల్లో అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వకపోతే యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

నేడు దివ్యాంగుల బస్ పాస్ మొబైల్ కౌంటర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావల మండల కార్యాలయంలో ఈనెల 21న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగుల బస్ పాస్ మొబైల్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్‌తో పాటు ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకురావాలని సూచించారు. అపరాధ రుసుము రూ. 50 చెల్లిస్తే, 50 శాతం రాయితీతో దివ్యాంగులు బస్ పాస్ పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

నవతెలంగాణ-జన్నారం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జన్నారం 1988-1989 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన మిత్ర చారిటీ ద్వారా వాటర్ ఆర్వో ప్లాంటును ప్రధాన ఉపాధ్యాయులు ఎస్ విజయకుమార్‌కు అందించారు. సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, ఈ పాఠశాలలో చదివి ఈ చిరు సాయం చేయడం జరిగిందన్నారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు స్పందించి పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిత్రచారిటీ సభ్యులు జే లింగన్న, కొల్లూరి కమలాకర్, వొజ్జల వామన్, బండ దేవేందర్, దుర్గం లక్ష్మీనారాయణ, ఎం శ్రీనివాస్, ఎండీ రహీముద్దీన్, జి రమేష్, దోంతుల గంగాధర్, సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం



డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన మండలంలోని అల్లినగర్ గిరిజన గ్రామానికి చెందిన రాయిసిండం శ్రీహరిని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాయిసెంటర్ నాయకులు సోనే రామ్, తుమ్మరం పవన్ కుమార్ మాట్లాడుతూ గిరిజనులు చదువుకుంటేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మడావి బాదుషా, రాయిసీండం కాశీ, ఉరువేత ధర్మ, అత్రం హనుమంతరావు, అత్రం నరసింహారావు, నాగార్జున, శ్రీనివాస్, ధర్మారావు పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాలలో..

రాష్ట్రంలోని రైతులందరికీ వర్షాకాలం రైతు భరోసా ప్రకటించక పోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ఐబీ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులను నమ్మించి నట్టేట ముంచిన ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతుల ఓట్ల కోసం మొసలి కన్నీరు కార్చి రైతు భరోసా కింద రూ.15000 అమలు చేస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక వర్షాకాలపు రైతు భరోసా ఇవ్వలేమని చెప్పడం ప్రభుత్వ సిగ్గుమాలిన తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు రైతు భరోసా పేరిట తెలంగాణ రైతాంగాన్ని నిలువునా మోసం చేశారని విమర్శించారు.

కాసిపేట : ముఖ్యమంత్రి రైతులను మోసం చేశావని, వరి కోతకు వస్తున్నా ఇప్పటికీ రైతు బంధు వేయలేదని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ఆదివారం రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకి నిరసనగా మండలంలోని కొండాపూర్ యాపా చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరుని ఎండగట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, మాజీ ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, ఏనుగు మంజులారెడ్డి, చింతల భీమయ్య, జాడి రాంచందర్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

లక్షెట్టిపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతులకు రైతు భరోసా, రుణమాఫీ నిలిపివేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య మాట్లాడుతూ బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిరన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ చుంచు చిన్నయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జన్నారం : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా ఇవ్వాలని, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, జిల్లా నాయకులు సిటీమల భరత్ కుమార్, కేప నరసింహులు, ఫజల్ ఖాన్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

తాండూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుపరచకుండా రైతులను మోసం చేసిందని మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు రైతు బంధు పథకం అమలు పరచడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పూసాల ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ రైతు భరోసాపై ఆశలు పెట్టుకున్న రైతాంగానికి రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ మొండి చేయి చూపిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ పురుషోత్తం గౌడ్ దత్తాత్రేయరావు, దత్తు మూర్తి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సంతోష్, మాజీ ఎంపీటీసీ శంకర్, మాజీ సర్పంచ్ క్రిస్టఫర్ పాల్గొన్నారు.

జైపూర్ : ప్రభుత్వం ఇపుడు రైతు భరోసా ఎగవేతకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ విమ్మర్శించారు. బీఆర్ఎస్ పిలుపులో భాగంగా ఆదివారం మండల కేంద్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎకరాలకు రూ. 15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందుతుందని ఎదురు చూస్తుండగా ఖరీఫ్ సీజన్ పెట్టుబడి సాయం ఇవ్వడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భీమారం అధ్యక్షులు కలెగూర రాజకుమార్, నాయకులు అర్నె సమ్మయ్య, ఆతుకూరి రాము, రామటెంకి లింగస్వామి, ఆసంపల్లి రాజమల్లు, జగన్ గౌడ్ పాల్గొన్నారు.



జైపూర్‌లో..



లక్షెట్టిపేటలో..



కాసిపేటలో..



జన్నారంలో..

దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతాం..!

- రూ.1.20 కోట్లతో పనులు ప్రారంభం



నవతెలంగాణ-జైపూర్

ప్రజల అవసరాల మేరకు దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల పరిధిలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేవిధంగా కృషి చేస్తామని అన్నారు. గంగిపల్లి, ఎల్కంటి, పెగడపల్లి, కుందారం గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణపు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఎల్కంటి గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసిన పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాశ్ రావు అన్నారు.

ఎస్సీ వర్గీకరణ ముసుగులో రిజర్వేషన్ ఎత్తివేసేందుకు కుట్ర



నవతెలంగాణ-జన్నారం

వర్గీకరణ ముసుగులో రిజర్వేషన్ ఎత్తివేయాలని కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు చూస్తున్నాయని మాల మానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్ల రమేష్ నాయకులు అక్కవత్తుల దేవయ్య బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి ఏబీసీడీ వర్గీకరణను చేస్తామని ప్రకటించడం అంటే రిజర్వేషన్లు పూర్తిస్థాయిలోఎత్తివేయడానికే పావులు కదపడమేనన్నారు. రిజర్వేషన్ ఎత్తివేసి దళితులకు రాజ్యాంగం ద్వారా వచ్చే హక్కులను సంపదను దూరం చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టును తప్పుదారి పట్టించిన పాలకవర్గాలు మాల మాల ఉపకులాల ఉద్యమాన్ని కూడా తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. ఈ విషయంపై మాల మాల ఉపకులాలు ఐక్యంతో పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. జాతి సమైక్యతను కాపాడాలన్నారు. ప్రభుత్వం సర్వేల పేరిట ఆలస్యం చేయకుండా నిజమైన కులగరణ చేపట్టి ఆ తర్వాతనే రిజర్వేషన్లు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, నాయకులు సిటీమల భరత్ కుమార్, జాడి గంగాధర్, ముల్కాల ప్రభాకర్, జునుగురి మల్లయ్య, దుర్గం నందయ్య, మునిసిల శైలేందర్ దుర్గం అమృతరావు, మాణిక్యం లక్ష్మణ్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మురిమడుగు ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం పనిచేసి ఇటీవల బదిలీపై, పదోన్నతిపై ఇతర పాఠశాలకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులకు మురిమడుగు ఉపాధ్యాయ బృందం విద్యార్థులచే సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లెల్లి సంతోష్ గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై ద్వారక ఉన్నత పాఠశాలకు వెళ్లిన సందర్భంగా, తన్నీరు కోటేశ్వరరావు హిందీ పండిట్ సుదీర్ఘకాలం పనిచేసినుద్యోగోన్నతిపై భీమిని మండలానికి బదిలీ అయిన సందర్భంగా వారు మురుమడుగు పాఠశాలలో చేసిన కృషిని ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్ అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సంస్కృతి కార్యక్రమాలు అందర్నీ అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు సంతోష్ పాఠశాలకు పోడియంను బహుకరించారు. అదేవిధంగా హిందీ ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు స్టేజ్ స్క్రీన్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనుమల రాజన్న, తాళ్లపల్లి కొమురయ్య, కందుల తిరుపతి ,అంకుష్, సురేష్ కుమార్, సాకేరా సుల్తానా పాల్గొన్నారు

రాంపూర్‌లో రైతుల క్షేత్ర సందర్శన



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలో రాంపూర్ గ్రామంలో కొట్టే రవి రైతు చేనులో సర్కార్ బీటీ విత్తనాలు సాగు చేసిన సందర్భంగా ఆదివారం 500 మంది రైతులతో క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ పత్తి చేను చూసిన రైతులు సర్కార్ కాయ బాగా కాసిందని కొమ్మలు ఎక్కువగా ఉండి చెట్టుకు 80 నుండి 90 కాయల వరకు ఉన్నాయని తెలిపారు. తెల్ల దోమ పచ్చ దోమ తట్టుకొని మంచి దిగుబడినిస్తుందని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కంపెనీ జోనల్ మేనేజర్ శివకోటేశ్వరరావు రైతులకు పంట సాగుపై వివరించారు. ఎటువంటి వర్షాలు వర్షాభావ పరిస్థితుల్లోనైనా సర్కార్ పత్తి విత్తనాలు సాగు చేసి మీరందరూ అధిక దిగిబడులు పొందాలని రైతులకు వివరించారు. గింజ శాతం ఎక్కువగా ఉండి అధిక దిగుబడి అధిక బరువు వస్తుందని ఆయన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డిస్ట్రిబ్యూటర్స్ శ్రీ కొమురవెల్లి మల్లికార్జున ఫర్టిలైజర్ యజమాని మేడం మల్లేష్, కంపెనీ రీజినల్ మేనేజర్ వాసా శంకర్ రావు, కంపెనీ ఏరియా మేనేజర్ వెంకట రమణరెడ్డి పాల్గొన్నారు.

27న ఎమ్మార్పీఎస్ సదస్సును విజయవంతం చేయండి



నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 27న జన్నారంలో నిర్వహికంచే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తలు సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ జన్నారంలో జరిగే ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అమలు చేయుమని ఉత్తర్వులు జారీ చేసిందని కానీ తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న అలసత్వానికి నిరసనగా ఈ నెల 27న జన్నారం మండలంలో ఉమ్మడి జిల్లా కార్యకర్తల సదస్సును నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. మాదిగ ఉపకులాలు సంఘాలు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్, జంగం రవి, మామిడి పెళ్లి ఇందయ్య, బచ్చల కృష్ణ, ముల్కల రమేష్, మంద రాజేష్, కత్తెరపాక రాజేష్, దుమల్ల ఎల్లయ్య, మామిడిపెల్లి రాహుల్, శ్రీపెల్లి అంజన్న, చిట్యాల వెంకటేష్, బెరిగడి వెంకటేష్, కొండుకూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



నవతెలంగాణ-జన్నారం

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు. అక్రిడేషన్ కార్డ్, బస్సు పాస్‌తో సహా, రైల్వే పాస్ హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. వాటిని సాధించుకోవాలంటే యూనియన్ బలోపేతంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చు అన్నారు. ఆదిలాబాద్ నిర్మల్ ఆసిఫాబాద్ మంచిర్యాల జిల్లాలకు వివిధ పత్రికలకు చెందిన జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరారు. సంఘాన్ని బలోపేతం చేయాలని వారికి సూచించారు. కార్యక్రమములో టీడబ్ల్యూజేఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తోట్ల మల్లేష్ యాదవ్, మధు, సీనియర్ జర్నలిస్టు దయాకర్, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

తప్పుడు కేసులు నమోదు చేసేందుకు కుట్ర

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

నవతెలంగాణ-మంచిర్యాల



ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు తనపై తన కొడుకు విజిత్‌పై తప్పుడు కేసులు నమోదు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఆదివారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ అధికారం ఎవరికీ శాశ్వతం కాదని 20 సంవత్సరాలు పదవిలో ఉన్నప్పటికీ ఎవరిపై అక్రమంగా కేసులు బనాయించలేదని సెటిల్మెంట్‌లు, అక్రమాలు చేయలేదన్నారు. ప్రెస్ మీట్‌లు పెట్టి మాపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి భూ కబ్జాలు, బ్యాంకుల్లో లోన్లు ఎగ్గొట్టలేదని, 50 ఏండ్ల రాజకీయ చరిత్రలో నియోజక వర్గ ప్రజల సమస్యల కోసం పోరాటం చేశాను తప్ప ఎపుడు ప్రజల్ని ఇబ్బంది పెట్టలేదని తెలియజేశారు. అక్రమంగా డబ్బులు సంపాదించే ఉదేశ్యం మాకు లేదని పేర్కొన్నారు. మంచి కోసమే దివాకర్ రావు మంచిర్యాలలో ఉన్నాడని, నియోజక వర్గ ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చిన ముందు ఉంటానని శాంతి యుతంగా సమస్యలు పోరాడుతామని తెలిపారు.

అన్యాయంగా జైలు పాలు చేశారు

నా భర్తను అన్యాయంగా జైలు పాలు చేశారంటూ హాజీపూర్ మాజీ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త శ్రీనివాస్ కార్‌లో వేళ్తుండగా ముగ్గురు యువకులు కింద పడి ఉండడం గమినించి వారికీ సహాయం చేసేందుకు వెళ్లారని, అదే సమయంలో యువకులు నా భర్తపై దాడి చేసి నువ్వే కార్‌తో ఢీకొట్టవని ఇష్టం వచ్చి నట్లు గాయపరిచారని తెలిపారు. గాయాల పాలైన తన భర్తను ఆస్పత్రికి తీసుకెళ్తే పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పి జైలుకు తీసుకెళ్లాల్సిన అవసర ఎం వచ్చిందని పోలీసులను ప్రశ్నిచారు. అనుకున్న ప్రకారం దాడి చేశారని వాళ్లకు దెబ్బలు ఒక చోట తగిలితే మరో చోట పట్టి కట్టించుకొని, గాయాలు కాక పోయిన గాయాలైనట్లు చికిత్స పొందుతున్నారని తెలియజేశారు. అన్యాయం గ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని తన భర్తను కాపాడుకోవడానికి ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో విజిత్‌రావు, పెంట రాజయ్య అంకం నరేష్, గాదె సత్యం పాల్గొన్నారు.

ఆంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

బీఆర్ ఆంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ ఆంబేద్కర్ విగ్రహంతో పాటు కాక వెంకటస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కోసం ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు, దళిత సంఘాలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ దళితులు మరింత చైతన్యవంతులు కావాలి, గతంలో మాదిరిగా కాకుండా దళితులు, బడుగు బలహీణ వర్గాల వారు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో అసంపూర్తిగా నిర్మించిన ఆంబేద్కర్ కమ్యూనటి హాల్ నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారికి న్యాయం చేయడం కోసం గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ల నిర్మాణాలు భవిష్యత్తులో చేపడుతామని అన్నారు. నేతకాని మహార్ కుల సంఘాల అభ్యర్థన మేరకు చెన్నూర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ అంటే కాక వెంకటస్వామి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సీడబ్ల్యూసీ మెంబర్, పెద్దపల్లి మాజీ ఎంపీ కాక గడ్డం వెంకటస్వామి అంటే కాంగ్రెస్ పార్టీ అని మాల మహానాడు చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షుడు శీలం వెంకటేశం, మంతెన లక్ష్మన్ అన్నారు. మండల కేంద్రంలో బాబ సాహెబ్ బీఆర్ ఆంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతో పాటు కాక వెంకటస్వామి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చొరవతో మండల కేంద్రంలో బీఆర్‌ఆంబేద్కర్ విగ్రహం ఏర్పాటు మండల వాసుల చిరకాల ఆకాంక్ష తీరబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



పద్మశాలి సంఘం జన్నారం పట్టణ కమిటీని ఆదివారం ఆ సంఘం మండల అధ్యక్షుడు శెట్టిపల్లి గంగయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా శెట్టిపల్లి కృష్ణ ఉపాధ్యక్షుడిగా కందుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా అయ్యోరు శ్రీనివాస్, కోశాధికారిగా దోమల భాస్కర్, ప్రచార కార్యదర్శిగా బొద్దుల అంజన్న, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చెట్పల్లి గంగయ్య మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల్లో పద్మశాలి సంఘం గ్రామ కమిటీలను వేయడం జరుగుతుందన్నారు. సంఘ బలోపేతానికి సంఘ నాయకులు కృషి చేయాలని కోరారు. పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

నూతన అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండలకేంద్రానికి చెందిన జక్కుల నారాయణ వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైనందుకు ఆదివారం మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జక్కుల నారాయణ దివ్యాంగులకు చేసిన సేవలను గుర్తు చేస్తూ వారు చేసిన ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గంగాధర్, అనీల్ మాసం, గంగుల మల్లేష్, జక్కుల వెంకటేష్, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-తలమడుగు

సోయాబీన్ పంటకు ఎకరానికి 6 నుండి 10 కింటాళ్ల వరకు అనుమతి ఇచ్చినందుకు ఆదివారం రుయ్యాడి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, రైతులు మాట్లాడుతూ సీఎం రైతుల పక్షాన నిలబడి రైతులకు రుణమాఫీతో పాటు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రైతుల పక్షాన నిలబడిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో లోక ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ, రాకేష్, రామన్న, సురేష్ రెడ్డి, గంగన్న, రామ్‌రెడ్డి, సుభాష్, గణపతి రెడ్డి పాల్గొన్నారు.



ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

- లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమని లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని గూడెం గ్రామంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో గ్రామస్తులతో మాట్లాడారు. నేరాల నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా రక్షణ భద్రత పోలీసుల బాధ్యత అని గ్రామాల్లో ఎవరైనా అనువాదాస్పద వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని సన్మార్గంలో ప్రయాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వవద్దని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలు పోలీసులకు తెలుపాలని అలా తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని హెల్మెట్ తప్పకుండా ధరించాలని మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అన్నారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని కోరారు. సీసీ కెమెరాల విషయంలో పోలీసుల సహకారం పూర్తిగా ఉంటుందని భద్రతపరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆయన వెంట దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్, లక్షెట్టిపెట్ ఎస్ఐ సతీష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మార్కండేయ ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో శ్రీ శివభక్త మార్కండేయ ఆలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేరుగు భోజన్న అధ్యక్షతన ఇర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సిరిపురం చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా బైరి రవి, కోశాధికారులుగా ఆడెపు ప్రసాద్, కటకం నగేష్, ఉపాధ్యక్షులుగా తడక పోశెట్టి, గంగుల రవి, దాసరి గంగయ్య, సంయుక్త కార్యదర్శులు కడేర్లల గణేష్, కట్కం రాజేంద్ర ప్రసాద్, పెంట నరేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మాసం అనీల్, గంగాధర్, కిరణ్, గంగుల మల్లేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్ఏ వన్ పరీక్షలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని అన్నీ యాజమాన్య పాఠశాలలో చదివే ఒకటి నుంచి పదవ తరగతి విద్యార్థులకు సోమవారం నుండి 28 వరకు సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు (సంగ్రహణాత్మక పరీక్షలు) జరుగుతాయని డీఈఓ ఏ.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను అన్నీ యాజమాన్యాల పాఠశాలలకు ఇదివరకే తెలియజేశామన్నారు. ప్రశ్నా పత్రాలను కూడా డీసీఈబీ ద్వారా ఇదివరకే అన్నీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశామన్నారు. షెడ్యూల్ ప్రకారం అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మార్చిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో పీఆర్టీయూ టీఎస్ బలపరిచిన అభ్యర్థి మహేందర్ రెడ్డిని గెలిపించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్ కోరారు. ఆదివారం పీఆర్టీయూ భవనంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. మార్చిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో సంఘం నిలబెట్టిన అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. గతంలోని ఓటరు లిస్టు రద్దవుతుందన్నారు. మూడు సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నంబర్ 6వ తేది వరకు సమయం ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు తమను సంప్రదిస్తే ఓటరుగా నమోదు చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు సమస్యలు అనేకంగా ఉన్నాయని వాటిపై సంఘం ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-1988 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రోజు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 36 సంవత్సరాల తర్వాత కలిసి చదివిన స్నేహితులందరూ ఒక్క చోటికి చేరి తమ బాల్యంలో చేసిన పనులన్నీ గుర్తు చేసుకుంటూ అదేవిధంగా తమకు బోధించిన గురువులను గుర్తు చేసుకొని తమ సంతోషాలను ఒకరినొకరు పంచుకున్నారు. 36 సంవత్సరాల తర్వాత బాల్య మిత్రులందరికీ ఒకే చోటుకి చేరడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. కార్యక్రమాన్ని మనోహర్‌రెడ్డి, భీమిరెడ్డి, రమా గౌడ్, ఎల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నరసింహులు అందరూ బాల్యమిత్రులందరికీ ఒక చోటికి చేర్చి తమ ఆనందాలను పంచుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కామారెడ్డి

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆదివారం టిఆర్ఎస్ నాయకులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, గట్టుగోని గోపిగౌడ్, కుంబాల రవియాదవ్, కౌన్సిలర్లు గెరిగంటి లక్ష్మీనారాయణ, నజీరోద్దీన్, కృష్ణాజిరావు, కాసర్ల స్వామి, నాయకులు బల్వంత్‌రావు, భానుప్రసాద్, మల్లేష్ యాదవ్, సుమిత్రా ఆనంద్, రావుల గంగాధర్, దుబ్బాక ప్రసాద్, లద్దూరి కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు రెండు కిస్తులను ఇవ్వాలి

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న
- జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు

నవతెలంగాణ-బేల

ఖరీఫ్ పంటలపై రైతులు ఎంతగానో ఎదురుచూస్తున్న రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతుభరోసాను ఇవ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం మండలంలోని జాతీయ రహదారిపై పార్టీ కార్యకర్తలు, రైతులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గ్రామాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతు బీమా, రైతు భరోసా రైతు కూలీలకు రూ.15000 ఇలా 420 హామీలు ఇచ్చి వాటిని పూర్తి చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం 10 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిరసనలను ఎదుర్కొంటుందన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతు భరోసా అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిలా అనిల్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మోహిమోద్దీన్, మాజీ ఎంపీటీసీ దేవిదాస్, పుప్పాల పీరాజీ, రైతులు, బీఆర్ఎస్ నాయకులున్నారు.

తలమడుగు : బీఆర్ఎస్ పిలుపు మేరకు మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆదివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, అబ్దుల్లా, కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, గజానన్, మహేష్ దేశముక్, కేదారేశ్వర రెడ్డి, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, పెందూరు మాధవరావు, చంటి, మేకల రవికాంత్ పాల్గొన్నారు.

తాంసి : ఎన్నికల సమయంలో రైతులందరికీ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆదివారం తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆయా మండల కేంద్రాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఎలాగైనా రావాలని ఉద్దేశంతో అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ఇటు రైతులను నిరుపేద కుటుంబాలను దగా చేసిందన్నారు. ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీతో పాటు ఎకరాకు రూ.15వేల



చొప్పున రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నాగయ్య, సుధాకర్, వినోద్‌రెడ్డి, కృష్ణ, సంజీవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రఘు, లస్మన్న, మహేందర్, అశోక్, అఫ్రోజ్, అనిల్, ఆయా మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్ : ఎన్నికల్లో హామీ ఇచ్చి, రైతులకు రైతు భరోసా, ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి మోసం చెందని మాజీ జెడ్పీటీసీ రాజనాల సంధ్యారాణి అన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కి రాష్ట్ర రైతాంగంతో పాటు యావత్ తెలంగాణ ప్రజలని మోసం చేసిందన్నారు. ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి పూర్తిగా ఎగ్గొట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తహీర్ బిన్ సలాం, శ్రీధర్‌రెడ్డి, రమణగౌడ్, ఎలుక రాజు, సురేందర్ యాదవ్, చిలుకూరి నరేందర్, సత్యనారాయణ, సోమన్న రాజేందర్, చిన్నయ్య సుధీర్ రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.







హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి సామాన్య ప్రజానికానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఈనెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో ఊరు వాడా పార్టీ నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మివాడలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్షంపై ఉందన్నారు. ఇందులో భాగంగానే కేటీఆర్ జిల్లాలో పర్యటించి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల విషయంలో ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయంలో ప్రగతి పథంలో సాగిన తెలంగాణ, ప్రస్తుతం తిరోగమన బాటలో నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా నిలుస్తామని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు అలాల్ అజయ్, సాజిదోద్దీన్, అశోక్ స్వామి, పందిరి భూమన్న, కొండ గణేష్, రామేశ్వర్, కోవరవి, నల్ల మహేందర్, పర్వీన్, యమున, నంద, సాయి కిరణ్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనతోనే అరాచకాలు

- దాని మతతత్వ కుట్రలను తిప్పికొట్టేందుకే పోరాటాలకు సిద్ధం కావాలి
- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- సీపీఐ(ఎం) నగర మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీజేపీ పాలనతో అరాచకాలు పెరుగుతున్నాయని, బిజెపి కుట్రలను తిప్పికొట్టేందుకే పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. పార్టీని బలోపేతం చేసుకుంటూ పోరాటాలను పెంచుకోవాలని సూచించారు. భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) నగర 7వ మహాసభ ఆదివారం నగరంలోని నాందేవాడలో గల పార్టీ కార్యాలయంలోని మునావర్ ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నగర కమిటీ సభ్యురాలు బి. అనసూయ అధ్యక్షతన సభ నిర్వహించారు. నగర మహాసభ సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభలో గత మూడు సంవత్సరాల కాలంలో నగరంలో నిర్వహించిన ఉద్యమ కార్యాచరణను కార్యక్రమాలను నివేదికను నగర కమిటీ సభ్యులు సుజాత వివరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఇండియా కూటమి గెలవకూడదని దుష్ప్రచారం చేశారని, అలాగే అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరిగితే గెలుస్తామని అనుకున్న బిజెపికి అయోధ్యలో బిజెపికి తగిన గుణపాఠం ప్రజలు చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణతో ఇతర పార్టీలతో కలిసి అధికారంలోకి బిజెపి ప్రభుత్వం వచ్చిందని ప్రజలే బుద్ధి చెప్పారని తెలిపారు. గ్రామపంచాయతీ నుండి మొదలుకొని ఎంపీ వరకు ఒకే దఫాలో జమిలీ ఎన్నికలు అనే నినాదంతో ముందుకు వెళ్లేందుకు ఎన్‌డీఏ సర్కార్ ఉవ్విళ్లురుతూందని, దీంతో రాష్ట్రాలకు ఉండే హక్కులు కోల్పోవడమే కాక.. అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుండి ఎంపీగా గెలిపించుకున్న ధర్మపురి అరవింద్ జిల్లా ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. నిజాంబాద్ ఎంపీ కేవలం సోషల్ మీడియాకు పరిమితమ య్యారని ప్రజలకు గల సమస్యలపై గొంతెత్తి ఎప్పుడూ కూడా మాట్లాడలేదని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. రైతుల సమస్యలు వారికి పట్టకనే వ్యవసాయ చట్టాలుగా తీసుకువచ్చారని అన్నారు. రైతుల ఉద్యమాలతో వాటిని వెనక్కు తీసుకున్నారని, ఉద్యోమాలతోనే డిమాండ్‌లు, హక్కులు సాధించుకోవచ్చని మరోసారి నిరూపితమైనట్టు తెలిపారు. ప్రస్తుతం బీజేపీని ఎదిరించాలంటే సీపీఐ(ఎం) మరింత క్యాడర్ పెంచుకోవాలని చెప్పారు. అంతకుముందు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయం సంక్షోభం నెలకొందన్నారు. మహానేత సీతారాం ఏచూరీని కోల్పోయామని, పూలు వేసి నివాళి అర్పిస్తే సరిపోదని, ఆయన ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే అసలైన నివాళి అందించిన వారమవుతామని తెలిపారు. దేశంలోనూ రాష్ట్రంలోనూ రోజురోజుకు శ్రమదోపిడి ఎక్కువ అవుతుందని కష్టపడి పని చేయించుకుంటు న్నారే తప్ప సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారని అన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే ఉద్యమించక తప్పడం లేదన్నారు. బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలే మహిళలను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్ మాట్లాడుతూ.. బిజెపి పార్టీ మూడోసారి అధికారంలోకి వచ్చాక విపరీతంగా ధరలు పెరిగిపోయాయని అదుపు చేయడంలో విఫలమయ్యారన్నారు. నోట్లను రద్దు చేయడమే కాకుండా మహిళలపై రోజురోజుకు హత్యలు, లైంగికదాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. ధరలు అదుపు చేయడంలో లైంగికదాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన కొనసాగించిందని, ప్రస్తుతం వచ్చిన కాంగ్రెస్ పార్టీ 11 నెలలైనా ప్రజా సమస్యలపై మాత్రం పనిచేయడం లేదని అన్నారు. ఇవన్నీ మారాలంటే ఎర్రజెండా వస్తేనే సమాజం మారుతుందని పోరాటాలకు అడుగులు వేయాలన్నారు. మహాసభలో సిపిఎం నగర కమిటీ సభ్యులు నరసయ్య, రాములు నరేష్, అనిత, దీపిక, రజియా, రేఖ,పద్మ, సునీత జ్యోతి, భూమన్న, ఉద్ధవ్,సురేష్ మధు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి విద్య రంగా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి అన్నారు. ఆదివారం బెల్లంపల్లిలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా జిల్లాలో నియామకమైన నూతన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం విద్యారంగం బలోపేతం కోసం కృషి చేయాలని రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డీఎలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు వేణు మాట్లాడుతూ గురుకులాల సమయసారినిలో మార్పు తీసుకురావాలని పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కిరణ్, చంద్రమౌళి, దేవిదాస్, రవికుమార్, సంతోష్, సంపత్, సతీష్, భబిత, సంరక్ష పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచిన నాయకుడు రాథోడ్ రమేష్



నవతెలంగాణ-జన్నారం

పేద ప్రజలకు అండగా నిలిచి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేసిన దివంగత మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ జయంతి సందర్భంగా స్థానిక ఆస్పత్రిలో ఆ పార్టీ నాయకులు రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉండే వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య ప్రధాన కార్యదర్శి బుర్ర గడ్డ జగన్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు బెడద గోపాల్ ఉపాధ్యక్షుడు అల్లం సురేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సామల లక్ష్మీరాజ్యం, యువత అధ్యక్షుడు ములుగు ప్రవీణ్, మాజీ మండల అధ్యక్షుడు వీరాచారి, జిల్లా యువ నాయకుడు పవన్, బూత్ అధ్యక్షుడు సంతోష్, అప్పల జలపతి, ముదేళ్ల శంకర్ పాల్గొన్నారు.